చక్కని వేదిక

- ప్రజా ప్రయోజనకరంగా సామాజిక భవనాలు
- 43, 44 వార్డుల్లో నాలుగు చోట్ల నిర్మాణం
- ప్రశాంతంగా కార్యక్రమాల నిర్వహణ
- అభివృద్ధి పనులపై స్థానికుల హర్షం

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా సరికొత్త కార్యక్రమం అమలు చేశారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు, మౌలిక అవసరాలు తెలుసుకుని దాని తగినట్టు రహదారులు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి కృషి చేశారు. జీవీఎంసీ నిధులతో ఆయా ప్రాంతాల్లో స్థానికుల అవసరాల తగినట్టు కొత్త సామాజిక భవనాలు నిర్మించారు. 43, 44 వార్డుల్లో అందుబాటులోకి వచ్చిన కమ్యూనిటీ హాళ్లతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు అవకాశం ఏర్పడింది.



జగన్నాథపురంలో కమ్యూనిటీ హాల్‌పై కొత్తగా నిర్మించిన మరో అంతస్తు

43వ వార్డులో..

జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురం శ్మశానవాటిక ఎదురుగా ఉన్న పాత సామాజిక భవనంపై రూ.13.50 లక్షలతో అదనపు అంతస్తు నిర్మించారు.

- వేంకటేశ్వర కాలనీలోని రెండంతస్తుల సామాజిక భవనంపై రూ.20 లక్షలతో అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నారు. స్థానికుల శుభకార్యాలకు, సమావేశాలకు అనువుగా ఉండేలా దీని నిర్మాణం చేపడుతున్నారు.



ముస్లిం తాటిచెట్లపాలెంలో కొత్తగా నిర్మించిన రెండంతస్తుల సామాజిక భవనం

44 వార్డులో..

జీవీఎంసీ 44వ వార్డు అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లోని షాదీఖానా(కల్యాణ మండపం) సమీపంలో ముస్లిం తాటిచెట్లపాలేనికి వెళ్లే మార్గంలో గెడ్డ వద్ద రూ.45.84 లక్షల వ్యయంతో రెండంతస్తుల సామాజిక భవనం నిర్మించారు. గ్రౌండ్‌ ఫ్లోర్‌ను ఎంటీసీ పాలెం-2 అంగన్‌వాడీ కేంద్రానికి, మొదటి అంతస్తును 239 అబిద్‌నగర్ సచివాలయానికి కేటాయించారు.

- షాదీఖానా వెనుక ఉన్న ముస్లిం తాటిచెట్లపాలెం సామాజిక భవనంపై రూ.12 లక్షలతో అదనంగా మరో అంతస్తు నిర్మించారు. పొదుపు సంఘాల సమావేశాలకు దీనిని కేటాయించారు. ప్రజల అవసరాలకు తగ్గట్టు సామాజిక భవనాలు నిర్మించి అందుబాటులోకి తేవడంపై ఆయా ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ నిధులు.. సామాజిక భవన నిర్మాణాలు

- జీవీఎంసీ నిధులతో 43వ వార్డులో రెండు చోట్ల, 44వ వార్డులో రెండు చోట్ల సామాజిక భవనాలు, అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు.
- రూ.13.50 లక్షలతో జగన్నాథపురం కమ్యూనిటీ హాల్‌పై అదనపు అంతస్తు నిర్మాణం.
- రూ.20 లక్షలతో వేంకటేశ్వర కాలనీ సామాజిక భవనంపై అదనపు అంతస్తు నిర్మాణం.
- రూ.45.84 లక్షలతో ముస్లిం తాటిచెట్లపాలెంలో రెండతస్తుల సామాజిక భవనం నిర్మాణం.
- రూ.12 లక్షలతో ఎంటీసీ పాలెం సామాజిక భవనంపై అదనపు అంతస్తు నిర్మాణం

ఇది కదా అభివృద్ధి



జగన్నాథపురంలో కమ్యూనిటీ హాల్‌పై కొత్తగా నిర్మించిన మరో అంతస్తు

సౌకర్యంగా ఉంది



ముస్లిం తాటిచెట్లపాలెం-2 అంగన్‌వాడీ కేంద్రం చాలా కాలంగా ఇరుకు గదిలో ఉండేది. ఎంటీసీ పాలెంలో కొత్తగా సామాజిక భవనం నిర్మించాక, గ్రౌండ్ ఫ్లోర్ మా అంగన్‌వాడీ సెంటర్‌కు కేటాయించారు. పెద్ద హాల్, కిచెన్, స్టోర్ రూమ్, టాయిలెట్లు అన్ని సదుపాయాలు సమకూరాయి.

– లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్

సామాజిక భవనాలతో ఎంతో మేలు



43, 44 వార్డుల్లో స్థానిక అవసరాలకు తగినట్టు కొత్తగా సామాజిక భవనాలు, ఇప్పటికే ఉన్న వాటిపై అదనపు అంతస్తులు నిర్మించారు. ఒక చోట కొత్త భవనం, మూడు చోట్ల అదనపు అంతస్తులు నిర్మించడంతో స్థానిక ప్రజలకు చాలా ప్రయోజనకరంగా ఉన్నాయి.

– అప్పలరాజు, శ్రీనివాసనగర్

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



ధర్మానగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్‌లో క్రాంతి యువజన ప్రగతి మండలి ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన అంబేడ్కర్‌ను దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, కార్పొరేటర్లు అల్లు శంకరరావు, కామేశ్వరి, కె.అనిల్‌కుమార్‌రాజు, నాయకులు కిరణ్‌రాజు, ఎస్.శ్రీను, సిద్దార్థ, సురేష్, వై.శ్రీనివాసరావు, స్వామి, కరుణ, ఎన్.లక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'



వినతులు స్వీకరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్ని అర్జీలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ



మొదటి బహుమతి సాధించిన విద్యార్థులతో క్విజ్‌మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఉద్యోగార్థులకు గ్రూప్-2 పరీక్షల ప్రణాళిక ఆధారంగా వివిధ అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఏడు బృందాలుగా పాల్గొన్నారు. ఏడు రౌండ్లలో జరిగిన పోటీలో గెలిచిన విజేతలకు పుస్తకాలను బహుమతిగా ప్రదానం చేశారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు.

'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'పై అవగాహన

మురళీనగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై 49వ వార్డు బర్మా క్యాంప్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రసంగించారు. జీవీఎంసీ ఏపీడీ చిరంజీవి, కనకరత్నం, బీజేపీ నాయకులు ఒమ్మి నారాయణరావు, కె.జగదీష్, ప్రసాద్, కిరణ్, కృష్ణవేణి, ఆర్‌పీ రాజి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతాల్లో రూ.19.90 లక్షలతో పలు అభివృద్ధి పనులకు బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నారన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, డీఈ భరణికుమార్, ఏఈ చాణక్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, వార్డు నాయకులు అప్పారావు, గురువోజీ, సుకుమార్, విజయ్, సురేష్, రాఘవులు, రమేష్, కనకరాజు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కప్పరాడలో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: జోన్-2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి 33/11 ఇండస్ట్రియల్ ఎస్టేట్ సబ్ స్టేషన్, మద్రిపాలెం వుడా లేఅవుట్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్, మద్రిపాలెం, ప్రభుత్వ ఐటీఐ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, జ్యోతినగర్, గౌతమ్ గార్డెన్స్, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, సంకురుపేట, శ్రీరామ్‌నగర్, లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ బర్మా క్యాంప్, మద్రిపాలెం వుడా లేఅవుట్, లీడర్ ప్రెస్ ఏరియా, న్యూ కరాస, బీఆర్‌టీఎస్ రహదారి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఎస్‌టీఎల్ పరిధిలో..

మద్రిపాలెం: జోన్-2 ఎస్ఎస్‌టీఎల్ పరిధిలో 11 కేవీ సీతన్న గార్డెన్స్, ఎన్ఏడీ ఫీడర్ల నిర్వహణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్ఏడీ ఫీడర్‌లో ఓల్డ్ కరాస, న్యూ కరాస, గణేష్‌నగర్, శాంతినగర్, ఎన్ఏడీ మెయిన్ రోడ్డు ప్రాంతాలు, సీతన్న గార్డెన్స్ ఫీడర్‌లో ఎంఎస్ఆర్ పార్కు, న్యూ రాంసాయి పార్లర్ డౌన్, సీతన్న గార్డెన్స్, లేన్సమ్ గ్రీన్స్ దరి నరసింహనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

మిద్దె తోటల పెంపకం అవసరం

ఆరిలోవ: విశాఖను హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు మిద్దె తోటల పెంపకం అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో 13వ వార్డులో బుధవారం మిద్దె తోటల పెంపకంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కెల్ల సునీత, జోన్-2 అధికారులతో కలిసి ఆమె స్థానిక మహిళలకు మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మేయర్ మాట్లాడుతూ ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ఎకో గ్రీన్ అంశంపై టెర్రాస్ గార్డెన్‌లు అభివృద్ధి చేయాలన్నారు. అపార్ట్‌మెంట్లు, భవనాలపైన, గేటెడ్ కమ్యూనిటీల వద్ద మిద్దె తోటలు పెంచాలని సూచించారు. పచ్చదనం ఇచ్చే మొక్కలతోపాటు ఆకుకూరలు, కూరగాయల మొక్కలు కూడా పెంచుకోవచ్చన్నారు. వీటికి సంబంధించిన 12 రకాల విత్తనాలు ఏవిధంగా వినియోగించాలి, 12 రకాల మొక్కలను ఏవిధంగా పెంచాలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అపార్ట్‌మెంట్లలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని మేయర్ కోరారు. కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనకమహలక్ష్మి, యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ డి.లక్ష్మి, డీపీవో ప్రసాద్, ఎస్ఆర్‌యూ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు మొక్కలు అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం , యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

వేడుకగా రాపత్తు ఉత్సవాలు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు బుధవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వామనుడిగా దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వామనుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పసుపునీళ్లతో భక్తులు మరోమారు జలాభిషేకం చేశారు. ప్రత్యేక పూలతో అలంకరణ అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



జలాభిషేకం చేస్తున్న భక్తులు

29 నుంచి యోగా తరగతులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా, కాన్షియస్‌నెస్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి స్థూలకాయ నివారణ, థెరపటిక్ యోగా తరగతులను నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు యోగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు బీచ్ రోడ్డులోని యోగా కేంద్రంలో, 83743 51324, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

25వ వార్డులో ఫాగింగ్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో దోమల నియంత్రణకు బుధవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో మెగా ఫాగింగ్ నిర్వహించారు. బీటీఆర్ కాలనీ, హరిజన వీధి, కనకమ్మ వీధి, గణేష్ నగర్ 1, 2, 3, పాత చేపల మార్కెట్ ఏరియా, రాజేంద్రనగర్, శాంతిపురం, మధురానగర్, గురుద్వారా హైవే ప్రాంతాల్లో సిబ్బంది ఫాగింగ్ చేశారు.

రౌడీషీటర్ వీరంగం

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనగర్‌కు చెందిన గోపి అనే రౌడీషీటర్ వీరంగం సృష్టించాడు. వివరాలిలా.. జీవీఎంసీ 27వ వార్డు శ్రీనగర్‌లో నివసిస్తున్న ఈతలపాక గోపి అనే రౌడీషీటర్ బుధవారం అదే ప్రాంతానికి చెందిన వ్యక్తిని కొట్టాడు. స్థానికులు అందించిన సమాచారంతో ద్వారకా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు ముత్యాల వస్త్రధారణలో కన్యకాపరమేశ్వరి దర్శనం

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ముత్యాల వస్త్రధారణలో గురువారం అలంకరించనున్నారు. దేవాలయ ప్రాంగణంలో 250 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

ప్రకృతి వనం పార్కు ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1లో ప్రకృతి వనం పార్కును స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ బుధవారం ప్రారంభించారు. విభాగంలో ఉన్న పాత డంపింగ్ యార్డును ఉద్యోగులు ఇతర విభాగాల సహకారంతో పార్కుగా అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా సీఎండీ భట్ మాట్లాడుతూ విభాగంలోని స్క్రాప్‌ను వినియోగించి అందమైన పార్కుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన తరంగ్ వాటర్ ఫౌంటెన్‌ను, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) బాగ్చీ లెహర్ ఫౌంటెన్‌ను ప్రారంభించారు. పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎన్.వి.స్వామి, ఇతర సీజీఎంలు ఎ.కె. సోర్బీ, యు.శ్రీధర్, ఎస్.ఎం.ఎస్ విభాగం సీజీఎం పి.ఎస్.రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రహదారి మిలమిల



ఎఫ్‌సీఐ పార్కు ప్రాంతంలో కొత్తగా నిర్మించిన తారురోడ్డు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో చేపట్టిన రహదారి నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. మద్రిపాలెం ఎఫ్‌సీఐ పార్కు ప్రాంతంలో తారు రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. ఇక్కడి బీటీ రోడ్డు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల తరువాత ఈ రోడ్డు బాగుపడిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని విధాలుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అంటున్నారు. ఈ ప్రాంతంలో తారు రోడ్డు నిర్మించడంతో కొత్త శోభను సంతరించుకుంది.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

సీతమ్మధార: నియోజకవర్గంలోని పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అందజేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వైద్యం అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఆరోగ్య పరిస్థితి బాగోలేక డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న గుడాల శ్రీరామకృష్ణ పరమహంసకు రూ.5 లక్షలు, ఆళ్ల నరేష్‌బాబుకు రూ.లక్ష, లంకపల్లి ఆనందరావుకు రూ.65 వేల చొప్పున చెక్కులను కె.కె.రాజు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, కిరణ్‌రాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న కె.కె.రాజు

ఏవీఎన్ కాలేజీలో ముగిసిన 'ఆహ్వాన్ ఫెస్ట్'

డాబాగార్డెన్స్: నిత్యం పాఠ్యాంశాల బోధన, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే విద్యా సంస్థ.. కళలు, క్రీడలతో సందడిగా మారింది. ఆటపాటలతో అలరించడం ప్రత్యేకంగా నిలిచింది. సినీ హీరోయిన్, సినీ డైరెక్టర్, టీవీ కళాకారులు.. విద్యార్థులను తొలి రోజు మంత్రముగ్ధులను చేయగా.. ఇంద్రజాల ప్రదర్శనతో రెండో రోజు విద్యార్థులు పులకించారు. ఏవీఎన్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన 'ఆహ్వాన్ ఫెస్ట్-2023' బుధవారంతో ఘనంగా ముగిసింది. ఫెస్ట్‌లో భాగంగా ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థుల్లో నూతనోత్సాహానికి ఆహ్వానం పలికారు. సినీ నటుడు, జీవీఎంసీ బ్రాండ్ అంబాసిడర్ ఇనుగోలు ప్రసన్నకుమార్, సినీ హీరోయిన్ అవికాగోర్, జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్‌ల సందడితో కళాశాల ప్రాంగణం నిండింది. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి ఇంద్రజాల కళలో తనకున్న ప్రావీణ్యాన్ని ప్రదర్శించి ఆద్యంతం ఆకట్టుకున్నారు. ఏవీఎన్ కళాశాలలో చదువుకోవడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలం నుంచి ఏవీఎన్ కళాశాల ఉత్తరాంధ్ర జిల్లాలకే పరిమితం కాకుండా, ఇతర ప్రాంతాలకు చెందిన వారికి విద్య అందిస్తోందన్నారు. కళాశాలకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ఏయూ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా పోటీతత్వంతో ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, శంకర్‌నారాయణ, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, గాంధీ, సంతోషి, రామ్‌కుమార్, మహాలక్ష్మి, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డిని సత్కరిస్తున్న ఏవీఎన్ కళాశాల యాజమాన్యం

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ నివాసులను బెంబేలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా సీతమ్మధారలోని పలు వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, వాహన చోదకుల వెంటపడుతున్నాయి. రాత్రి పూట విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లేవారు భయాందోళనలు చెందుతున్నారు. వీటి బారిన పడి పలువురు గాయాలపాలయ్యారు. తాజాగా మంగళవారం సీతమ్మధార రాధాకృష్ణా లేఅవుట్‌లో ఓ వృద్ధుడిపై వీధి కుక్కలు దాడికి దిగే ప్రయత్నం చేశాయి. గుంపుగా చేరి అరుపులతో అతడిని భయభ్రాంతులకు గురిచేశాయి. ఇది గమనించిన స్థానికులు వెంటబెట్టడంతో కుక్కలు పరుగులు తీశాయి. లేదంటే వృద్ధుడిని తీవ్రంగా గాయపరిచేవి. రెవెన్యూ క్వార్టర్స్ నుంచి నార్త్ ఎక్స్‌టెన్షన్‌కు వెళ్లే రోడ్డులో వీధి కుక్కలు పగలు, రాత్రి వేళల్లో తిష్ట వేసి వాహన చోదకులను పరుగులు పెట్టిస్తున్నాయి. వీటి సంచారం, అరుపులతో రాత్రి వేళ ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రాధాకృష్ణా లేఅవుట్‌లో వృద్ధుడిపై దాడికి యత్నిస్తున్న వీధి కుక్కలు